
మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## మంత్రి సొంత నిధులతో ఉచిత భోజనం సౌకర్యం..

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా షెడ్యూల్ కులాల ఉచిత శిక్షణకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి విద్యార్థినీ, విద్యార్థుల కోరక మేరకు మంత్రి సొంత నిధులతో మూడు నెలల పాటు ఉచిత భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ రమేష్‌గౌడ్, మున్సిపల్‌వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి

### ప్రధాని నరేంద్రమోడీ ఆశీస్సులతో తొందరలోనే

## గద్వాల, మాచర్ల రైల్వే లైన్ మంజూరు చేయిస్తాం

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి**

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ప్రజాగోస బిజెపి భరోసా కార్నర్ సమావేశం వనపర్తి పట్టణంలోని 31,32 వార్డులు కెడిఆర్ నగర్‌లో శక్తి కేంద్రం అధ్యక్షుడు రాయన్నసాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి మాట్లాడుతూ దశాబ్దాలుగా సర్వేలకే పరిమితమైన గద్వాల మాచర్ల రైల్వే లైనును ప్రధాని నరెంద్ర మోడీ సహకారంతో నిదులు మంజూరు చేయించి రైల్వే లైను నిర్మిస్తామని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎంపి బండి సంజయ్‌కుమార్ ఐదు విడతలుగా చేసిన ప్రజా సంగ్రామ యాత్రలో ఇచ్చిన హామీ మేరకు బిజెపి అధికారంలోకి వస్తే విద్య,వైద్యం ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట సాధించుకున్న తెలంగాణలో నీళ్ల గజ్వేల్, సిద్ధిపేటకు నియామకాలు కెసిఆర్ కుటుంబానికి పరిమితమయ్యాయని, దళిత సీఎం, మూడు ఎకరాల వ్యవసాయ భూమి పేరుతో దళితులను మోసం చేశాడని, ఏకమొత్తంలో లక్ష రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేశాడని, స్థానిక వ్యవసాయ శాఖమంత్రి వనపర్తి జిల్లాలో 90 వేల మంది రైతులలో ఎంతమందికి రుణమాఫీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. స్వాతంత్రం వచ్చి 65 ఏళ్లయిన బ్యాంకు మెట్లెక్కిన పేదలకు జన్ ధన్ ఖాతాలతో 50 కోట్ల జీరో అకౌంట్‌లు ప్రధాని నరెంద్ర మోడీ తెరిపించారని, కరోనా సమయంలో ప్రతి రేషన్‌కార్డుకు500లు అకౌంట్‌లో వేశారని,130కోట్ల మందికి మూడుడోసుల వ్యాక్సిన్ ఉచితంగా అందజేసిన ఘనత మోడీదని రాష్టంలో ఆరోగ్యశ్రీని బంద్ పెట్టాడని, ప్రతివ్యక్తికి సంవత్సరానికి 5లక్షల రూపాయల భీమా సౌకర్యం లభిస్తుందని,దేశంలోని 80కోట్లమందికి మూడేళ్లుగా ఉచితరేషన్ అందిస్తున్నాడని,ఆవాస్ యోజనద్వారా దేశంలో 11కోట్ల ఇల్లు నిర్మించారని, తెలంగాణకు 150కోట్లు మంజూరయితే కాలేశ్వరానికి మళ్లించి పేదప్రజలకు సొంతింటికల దూరం చేసిన దుర్మార్గుడు కెసిఆర్ అని దుయ్యబట్టారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, బి. కృష్ణ, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి. శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, ఉపాద్యక్షులు ఎ. సీతారాములు, బి. కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ముప్పూరి చెన్నయ్య,బి. పరశురాం, జిల్లా అధికార ప్రతినిధులు పెద్దిరాజు, గొర్ల బాబురావు, బచ్చురాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మోర్చాల జిల్లా అధ్యక్షులు అనుజరెడ్డి, ఆకుపోగు కుమార్, సీనియర్ నాయకులు కొమ్ముసామేలు, డి. నారాయణ, పట్టణ అధ్యక్షులు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి సూగురు రాములు, అసెంబ్లీ కో కన్వీనర్ ప్రవీణ్, బూత్ కమిటి అధ్యక్షుడు గోవిందు, యువమోర్చా నాయకులు అరవింద్, చంద్రశేఖర్, శివకుమార్, ఓంప్రకాషచారి,మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంగారు శృతి

## ఛత్తీస్‌గఢ్ ప్లీనరీకి జీఎంఆర్..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీకి డీసీసీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతోపాటు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర జంగయ్య యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, నాయకులు సుభాష్‌రెడ్డి, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.



ప్లీనరీలో పాల్గొన్న జి మధుసూదన్‌రెడ్డి

### రూ.10వేల కోట్లతో దివిటిపల్లిలో..

# లిథియం పరిశ్రమ..!

- దేశంలో తొలి లిథియం గిగా సెల్ పరిశ్రమ మనదే
- 10 వేల మందికి ప్రత్యక్షంగా వేలాది మందికి పరోక్షంగా ఉద్యోగాలు
- అన్నం పెట్టే పరిశ్రమను అడ్డుకునే కుట్రలు తగవు

**మీడియాతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**




మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు దివిటిపల్లి వద్ద అమర్‌రాజా సంస్థ ఏర్పాటు చేస్తున్న లిథియం గిగా సెల్ ఫ్యాక్టరీ దేశంలోనే మొట్ట మొదటిదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రూ. 10 వేల కోట్లతో ఈ పరిశ్రమల వల్ల 10 వేల మందికి ప్రత్యక్షంగా వేలాది మందికి పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధి లోని ఎదిరలో ఈద్గా పనులను పరిశీలించిన తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. ఎదిర, దివిటిపల్లి సమీపంలో ఇప్పటికే ఐటి పార్కు నిర్మాణం పూర్తి కావచ్చిందని ఇప్పుడు లిథియం గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జిల్లా నుంచి బతుకుదెరువు కోసం 14 లక్షల మంది వలసలు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వలస వెళ్లిన వారు తిరిగి రాకపోవడమే కాకుండా స్థానికంగా అనేకమందికి కూడా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కశ్మీర్‌లో ఇటీవల కనుగొన్న లిథియం నిల్వపై ప్రపంచమంతా ఎన్నో ఆశలు పెట్టుకుందని తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాలకు అవసరమైన బ్యాటరీలకు లిథియం గుండెకాయ లాంటిదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ వాహనాల వల్ల ప్రపంచంలోని వాహన కాలుష్యాన్ని తరిమికొట్టే అవకాశం ఉందన్నారు. మన దివిటిపల్లి లిథియం గిగా ఫ్యాక్టరీలో తయారయ్యే లిథియం గిగా సెల్ బ్యాటరీలపై అందరి దృష్టి ఉందన్నారు. ఉపాధిని అందించే పరిశ్రమను కాపాడుకుందాం దివిటిపల్లిలో ఏర్పాటు చేసే లిథియం గిగా సెల్ ఫ్యాక్టరీ వల్ల ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని మంత్రి తెలిపారు. మేధావులు, విద్యావంతులు, యువత ఈ అంశంపై ఆలోచన చేసి పరిశ్రమ ఏర్పాటుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పరిశ్రమపై కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వారిపై స్థానికులే ఫిర్యాదు చేయాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ఏర్పాటు చేస్తున్న పరిశ్రమను అడ్డుకుంటే వారు ద్రోహులుగా మిగిలిపోతారని తెలిపారు. నిజంగా ఈ ప్రాంతానికి అన్యాయం జరిగే పరిస్థితి వస్తే అలాంటి సందర్భంలో పోరాడేందుకు తామే ముందుంటామని మంత్రి స్పష్టం చేశారు.

**ఎదిర అంటే ఏరి పారేసినట్లుండే...**

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఎదిర అంటే ఏరి పారేసినట్లుండేదన్నారు. కనీసం తాగునీటికి కూడా కటకటలాడే పరిస్థితి ఉండేదని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశామన్నారు. ఐటి పార్కు, లిథియం గిగా ఫ్యాక్టరీ పూర్తయితే ఈ ప్రాంతంలో ఇండ్లు, భూములు, స్థలాల ధరలు ఊహించని విధంగా పెరుగుతాయన్నారు. ఎదిర, దివిటిపల్లి, అంబటిపల్లి గ్రామాలతో పాటు మన జిల్లా మొత్తం దశ తిరుగుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, మార్కెట్ కమిటి ఛైర్మన్ రహమాన్, కౌన్సిలర్ యాదమ్మ, పార్టీ నాయకులు హనుమంతు, అల్లి ఎల్లయ్య, శేఖర్, రాములు, హాకీమ్, అజీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సబ్ సెంటర్ల నిర్మాణ పనులు మార్చి చివరి నాటికి పూర్తి చేయాలి..

**గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సబ్ సెంటర్ల నిర్మాణ పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం హాలులో పంచాయతీరాజ్ డిఇలు, ఎఇలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద 161 పాఠశాలల్లో టాయిలెట్లు, కిచెన్ షెడ్, కంపౌండ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 24 పాఠశాలలకు గాను మూడు ప్రారంభించుకున్నామని, ఇంకా 5 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మిగిలిన వాటిలో పనులు పూర్తి చేయాలని, మన ఊరు మనబడి కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణము, అదనపు గదులు, త్రాగునీరు, ఎలక్ట్రిసిటి, కంపౌండ్ వాల్ కలరింగ్ పనులన్నింటిని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మొక్కలు నాటించాలని, పెయింటింగ్, పాత్ వే పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని అన్నారు. స్కూల్ వారిగా పనులు పూర్తి చేసి ఆన్‌లైన్ రికార్డు నమోదు చేయాలన్నారు. మండలం వారిగా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఇజిఎస్ కంపోనెన్స్ మొదలు పెట్టాలని, పనులు పూర్తి అయిన వాటికి ఎఫ్‌టిఓ సబ్మిట్ చేయాలని, మన ఊరు మనబడి కింద ఇంకా మొదలు పెట్టని నిర్మాణ పనులు కంపౌండ్‌వాల్, కిచెన్‌షెడ్, టాయిలెట్స్ నిర్మాణ పనులు మొదలు పెట్టి వాటికి సంబంధించిన ఫొటోలు పంపించాలని ఏఈలను ఆదేశించారు. జిల్లాలో పల్లె దవాఖాన నిర్మాణ పనులు, సబ్ సెంటర్ వారిగా నిర్మాణము పనులు పూర్తి చేయాలని, ఇసుక సమస్య లేకుండా చూడాలని, కూలీల సమీకరణ ఉండాలని, నర్సరీలలో మొక్కలకు నీళ్లు పెట్టడం చేస్తున్నారా లేదా పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఆధార్ నమోదులో పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. శశికళ, అసిస్టెంట్ డిఆర్‌డిఎ నాగేంద్రం, పంచాయతీరాజ్ ఇంచార్జి ఇఇ ఆంజనేయులు, డిఇ సలీం, ఏఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### మన ఊరు మనబడి

## పనులు త్వరగా పూర్తి చేయాలి..

**నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి, ఫిబ్రవరి25 ప్రభాతవార్త :** ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడిపనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీ రాజ్ అధికారులతో మన ఊరు మనబడిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదట విడతలో ఎంపిక చేసిన 174 పాఠశాలల్లో ఇప్పటి వరకు 98 శాతం పనులు పూర్తికావడం జరిగిందన్నారు. మిగిలి పోయిన పను లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని పాఠశాలల్లో ప్రహరీగోడ, మరుగుదొడ్ల నిర్మాణ పనులు, ఫ్లోరింగ్ పనులు చేయాల్సి ఉ న్నాయని వాటిన త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫర్నిచర్ సిద్ధంగా ఉందని, త్వరగా పనులు పూర్తి చేసి పాఠశాలల్లో ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మన ఊరు మనబడి పనులే కాకుండా ఇతర పాఠశాలలో నిర్మిస్తున్న కిచెన్ షెడ్‌లు, డైనింగ్ హాల్‌లు గ్రామాలలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కడా ఇసుక కొరత లేదని, కాబట్టి పనులు మార్చి మొదటి వారం వరకు పూర్తి చేయాలన్నారు. మండలాల వారిగా పనుల వివరాలను ఏఈల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన వారికి ఇప్పటివరకు డబ్బులను చెల్లించడం జరిగిందని, పనులు పూర్తయి ఇంకా ఎవరికైనా డబ్బులు రాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఈఈ పిఆర్ నరెందర్, డిపిఓ మురళి, బాబురావు డివైఇఇ, పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## టార్గెట్ మార్చ్ 15..!

**ఆయిల్ పామ్ తోటల లక్ష్యాన్ని సాధించాలి**

**రైతులతో డిడిలు కట్టించాల :**

**మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్**



**మహబూబ్‌నగర్‌ప్రతినిధి, ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** ఆయిల్‌పామ్ తోటలపెంపకంలో భాగంగా మిగిలిపోయిన 800ల ఎకరాల లక్ష్యాన్ని మార్చి15లోగా పూర్తిచేయాలని మహ బూబ్‌నగర్ కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. శనివారం ఆయిల్ పామ్ తోటల పెంప కానికి సంబంధించి ఉద్యాన,వ్యవసాయశాఖ అధికారులు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులతో విడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ఇదివరకే గుర్తించిన రైతులలో ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం తరపున మొక్కలు,డ్రిప్ అన్నిరకాల సహకారం అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి గుర్తించిన రైతుల నుండి ప్లాంట్ మెటీరియల్‌కోసం వెంటనే డిడిలు తీసుకోవాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల పెంపకంలో భాగంగా 3262ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించగా,ఇప్పటివరకు 2000ల ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 2000ల ఎకరాలలో మొక్కలను నాటడం జరిగిందని, మరో 442 ఎకరాలకు మొక్కల సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఉద్యాన సహాయ సంచాలకులు సాయ బాబా కలెక్టర్‌కు తెలిపారు. మిగిలిపోయిన 800ఎకరాలకు మార్చి15లోగా రైతులు ప్లాంట్ మెటీరియల్‌కు డిడిలు చెల్లించినట్లయితే వారికి ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. తక్షణమే రైతుల ద్వారా డిడిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్లాంట్ మెటీరియల్ కోసం రైతులు డిడిలు చెల్లించిన వెంటనే మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు అంచనాలను తయారు చేసి సమర్పిస్తే తక్షణమే డ్రిప్ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి కూడా డిడిలు చెల్లించేలా సిద్దంగా ఉండాలన్నారు. ఎంఐ కంపెనీ ప్రతినిధులు తక్షణమే అంచనాలు తయారు చేసి సమర్పించాలని, అలాగే సూక్ష్మ పరికరాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఉద్యాన,వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వచ్చే సోమవారం నుండి శనివారంలోపు ముందుకొచ్చిన రైతులతో గుర్తించినవారు లేదా కొత్త వారైనా సరే డిడిలు చెల్లిస్తే మొక్కలకు డ్రిప్ మెటీరియల్‌కు, అదేవిధంగా 4 సంవత్సరాలు పంట పండించడంలో ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అంది స్తామని తెలిపారు. పంటల నమోదులో ఉన్న ఇబ్బందులను అధిగమించి కార్యక్ర మాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఉద్యానశాఖ సహాయ సంచాలకులు సాయిబాబా, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, ఎమ్ఐ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

## తండ్రిని గొడ్డలితో నరికి చంపిన తనయుడు

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** కన్న తండ్రినే అతి కిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన ఘటన గట్టు మండలం ఇందువాసి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన ఉరుకుంద (48), గత కొంతకాలంగా మద్యానిక బానిసయ్యాడు. ఆస్తిని పంచాలని తరచుగా తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ జరిగేది. ఆస్తి పంపకాల విషయంలో తండ్రి ఆలస్యం చేస్తున్నాడని కొడుకు వీరేష్ జీర్ణించుకోలేక పోయాడు. ఉరుకుంద గ్రామంలోని ఓ దేవాలయం వద్ద నిద్రిస్తుండగా ఇదే అదునుగా భావించిన వీరేష్, తన తండ్రి ఉరుకుందను గొడ్డలితో నరికి చంపాడని తెలిపారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల ద్వారా విచారణ చేపడుతున్నారు. ఈ విషయమై గట్టు ఎస్సై పవన్‌కుమార్‌ను సంప్రదించగా కేసు నమోదు చేశామని, నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

## కొత్తకోట సిఐపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి..

- పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- స్వామిభక్తి చాటుకోవాలంటే థర్డ్‌డిగ్రీ ప్రయోగించాలా
- ఖాకి డ్రెస్ వేసుకుని రౌడీలా వ్యవహరిస్తున్న సిఐ శ్రీనివాస్‌రెడ్డి..
- ఉన్నతాధికారులు స్పందించిన ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**బిసి పొలిటికల్ జెఎసి ఛైర్మన్ రాచాల యుగందర్‌గౌడ్**




మాట్లాడుతున్న రాచాల యుగందర్‌గౌడ్

**వనపర్తి రూరల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కొత్తకోట సిఐ శ్రీనివాస్‌రెడ్డిని విధుల నుండి తొలగించి, అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేసి కఠినంగా శిక్షించాలని బిసి పొలిటికల్ జెఎసి తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ రాచాల యుగందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ బాంక్వెట్ హాల్‌లో బాధితుడు శివయాదవ్‌తో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన శివయాదవ్‌ను ఈ నెల 22న మనిగిల్ల నుండి వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి చట్టవిరుద్ధంగా ఒక రోజంతా స్టేషన్‌లో పెట్టి సిఐ శ్రీనివాస్‌రెడ్డి బాధితుడు శివయాదవ్‌ను విచక్షణా రహితంగా కొట్టడమే కాక తీవ్ర చిత్రహింసలకు గురి చేశాడని మండిపడ్డారు. ప్రజలు కట్టిన పన్నులచే జీతాలు తీసుకుంటూ పార్టీ కార్యకర్తల్లా పనిచేయడం సరి కాదన్నారు. గతంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం పనిచేస్తున్న కొత్తకోట, వనపర్తిలో కూడా అనేక దందాలకు పాల్పడుతున్నా కూడా ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఒక నాయకుడి మెప్పుకోసం ఖాకీ డ్రెస్ వేసుకుని ఇంత నీఛంగా వ్యవహరించే బదులు ఇంటి ఆ నాయకుడి ఇంటి ముందు వాచ్‌మెన్ డ్యూటీ చేయడం మంచిదని హితవు పలికారు. రౌడీలా వ్యవహరిస్తూ, చట్ట విరుద్ధంగా సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పోలీస్ అధికారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి అతనిని కఠినంగా శిక్షించాలని పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ, డిఐజి, తెలంగాణ డిజిపికి కూడా ఫిర్యాదు కాపీలు పంపామని తెలిపారు. తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ బిసి కమిషన్ కూడా వెళతామని చెప్పారు. శివయాదవ్ కుటుంబానికి ప్రాణహాని ఉందని, వారికి ఏం జరిగినా సిఐ శ్రీనివాస్‌రెడ్డి బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. పోలీస్ కేసులు భయపడే ప్రసక్తే లేదని, ప్రజాస్వామ్య బద్ధంగా, న్యాయపోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

**బాధితుడు శివయాదవ్ మాట్లాడుతు...**

వాట్సప్ గ్రూపులో వచ్చిన ఓ పాత వీడియోను ఫార్వర్డ్ చేశానన్న నెపంతో వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి సార్ నన్ను బూటు కాలితో తన్ని, టైర్‌తో విచక్షణా రహితంగా కొట్టడమేగాక, రాత్రంతా చిత్రహింసలు పెట్టారని, కొట్టిన విషయం జడ్జితో చెబితే నన్ను, నా కుటుంబాన్ని ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించాడన్నారు. అతనిని సస్పెండ్ చేసి, నన్ను, నా కుటుంబాన్ని ఆయన బారినుండి రక్షించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్ యాదవ్, బిసి పొలిటికల్ జెఎసి నాయకులు అంజన్న యాదవ్, శేఖర్‌గౌడ్, స్వామినాయుడు, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్, రాష్ట్ర ఇంచార్జి సంతోష్ రాథోడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడు శివయాదవ్‌కు తగిలిన దెబ్బలు



వినతి పత్రం సమర్పిస్తున్న రాచాల యుగందర్‌గౌడ్

### 10లో 100 శాతం ఉత్తీర్ణత పెంపులో

## సబ్జెక్టు ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** 10వ తరగతి విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణత, విద్యా ప్రమాణాలు పెంపులో సబ్జెక్టు ఉపా ధ్యాయుల పాత్ర కీలకమని డీఈఓ గోవింద రాజులు అన్నారు. శనివారం బిజనపల్లి మం డల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశా రు. ఈ సంధ్భంగా 10వ తరగతి విద్యార్థుల గణిత ఫ్రీఫైనల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. పాఠశాల విద్యార్థినులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈఓ మెను నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నా రు. బియ్యం నాణ్యతను పరిశీలించి బియ్యాన్ని శుభ్రమైన నీటితో కడిగి భోజానాన్ని వండాలని వంట ఏజెన్సీని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు సాగించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు వారి వారి ఇంటి దగ్గర చదువుకునే సందర్భంలో ఆయా సబ్జెక్టుల్లో వచ్చే సందేహాలను నివృత్తి చేసుకునేలా జిల్లా వ్యాప్తంగా నిష్ణార్థు లైన 29 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారి ఫోన్ నెంబర్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామన్నారు. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

## ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట..

**సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి భూమిపూజ**

**ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**లింగాల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల నిర్మాణానికి పెద్దపీట వేస్తుం దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని శాయి న్‌పేట గ్రామంలో సేవాలాల్ మహరాజు గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే తెలంగాణ రాష్టం ఆదర్శంగా నిలిచిందని అన్నా రు. రాష్టంలో బంజారాల అభివృద్ధి కోసం, ఆలయ నిర్మాణానికి పూనుకోవడం చాలా సంతోష కరమన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంతుగా సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పం చ్ లక్ష్మణ్‌నాయక్, సింగిల్ విండో ఛైర్మన్ హనుమంతురెడ్డి, మాజీ జడ్పీటిసి మాకం తిరుపతయ్య, వైస్ ఛైర్మన్ వెంకటగిరి, నాయకులు బల్లారి నాగేశ్వర్, భాస్కర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామ్‌సింగ్, దీప్లానాయక్, ఇంద్రగౌడ్ పాల్గొన్నారు.



సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే

## శ్రీ తిమ్మప్పస్వామి దేవాలయంలో భక్తుల పూజలు



**మల్దకల్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం వాల్మీకి పూజారులు, అర్చకులు అభిషేకాలు, మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు తాటికుంట గ్రామానికి చెందిన పల్లా తిమ్మయ్యశెట్టి అన్నదానం ఏర్పాటు చేశారు. దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

## శిశుమందిర్ పాఠశాలల స్వపరిపాలన దినోత్సవం



**మక్తల్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మక్తల్ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వ హించుకున్నారు. విద్యార్థులు ఆచార్యులుగా, టీచర్లుగా బాధ్యత తీసుకున్నారు. అదే విధంగా జిల్లా కలెక్టర్‌గా వి.సింధుజ, జిల్లా విద్యాశాఖాధికారులుగా శైలజ, మండల విద్యాశాఖాధికారిగా ప్రణీత్, ప్రధానాచార్యులుగా రాజేశ్, ఇతర విద్యార్థులు వివిధ బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల అధ్య క్షుడు రఘుప్రసన్న భట్ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ సమాజ నిర్వహణ ప్రతీ విద్యార్థికి అనుభవంలోకి రావడం కోసం స్వపరిపాలన దినోత్సవం లాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో చక్కటి విద్యాబోధన చేశారన్నారు. చిన్నారులు మాట్లాడుతూ ఆచార్యులుగా అలాగే వివిధ బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కావలి వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, చిట్యాల ఆంజనేయులు, కొండా విజయ్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌టీపీ బలోపేతానికి కృషి చేద్దాం...



**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** నియోజకవర్గంలో వైఎస్ఆర్‌టీపీని బలోపేతం చేద్దామని కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జీ చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీలో వివిధ పార్టీల్లో నుంచి పలువురు నాయకులు చీమర్ల అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌టీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో నియంత పాలన కొనసాగుతుందని, వైఎస్ఆర్‌టీపీ షర్మిల నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరడానికి యువత ముందుకొస్తున్నారని, వారికి అన్ని విధాలుగా వెన్నుదండుగా ఉంటానన్నారు. రానున్న రోజుల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో వైఎస్ఆర్‌టీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, సంతోష్, సందీప్, జగన్, కృష్ణ, శ్రీకాంత్, జంగయ్య, శ్రీధర్, పవన్, కొండలు, ప్రశాంత్, నితిన్, చేతన్, రాజేందర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు బి.శ్రీనివాస్‌గౌడ్, విజయ్, సాయితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్



**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. పేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని ఆయన తెలిపారు. వెల్దండ మండలం కేస్లీ తాండ గ్రామ పంచాయతీలో గల మూడు మిద్దెల తాండకు చెందిన గమ్లీకి మంజూరైన రూ.1లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధ పడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనునాయక్, తాండ వాసులు నాగయ్య, గ్రామ విజయ డైరీ చైర్మన్ శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

## కళాశాల అభివృద్ధికి అందరం కృషి చేద్దాం..

**ప్రిన్సిపాల్ డా.అప్పియ చిన్నమ్మ**



**జడ్చర్ల,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణంలోని డా.బిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మార్చి 15,16 తేదీలలో న్యాక్ బృందం పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో శనివారం నాడు కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ అధ్యక్షతన విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల సమస్యలు వాటి పరిష్కారం, కళాశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులతో తగిన సలహాలు, సూచనలు స్వీకరించారు. అదేవిధంగా న్యాక్ పరిశీలన సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు అనుసరించే విధానాలను న్యాక్ శ్రీనివాసులు తెలియజేశారు. స్టూడెంట్, పేరెంట్స్ కమిటి కన్వీనర్ డా. మంజుల మాట్లాడుతూ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్ రావడం వల్ల కళాశాల మంచి పేరుతో పాటు అధిక నిధులు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ నిధుల ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని వసతులు సమకూర్చుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రాయలగండి చెన్నకేశవస్వామిపై రాజకీయాలు వద్దు

**చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు**

**ఎండోమెంట్‌లో కలపడం శుభపరిణామం**

**అచ్చంపేట భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి సతీష్ మాదిగ**



**పదర,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రాయలగండి చెన్నకేశవస్వామి పై రాజకీయాలను మానుకోవాలని ఈ గుడికి ఎంతో పురాతన చరిత్ర ఉందని బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి సతీష్ మాదిగ అన్నారు. శనివారం పదర మండల కేంద్రంలోని శ్రీ రాయల గండి చెన్నకేశవస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నల్లమల ప్రాంతంలో ఎక్కువగా దేవాలయాలు ఉన్నాయని ఆ గుడులను కాపాడుకునే బాధ్యత ఈ నల్లమల ప్రాంత ప్రజలకు ఉందన్నారు. వ్యక్తులకు భజన చేయకుండా దైవపూజ చేయాలని బడుగు బలహీన వర్గాల సంస్కృతిని దెబ్బతీయకుండా కార్యక్రమాలను చేయాలని వారు తెలిపారు. గతంలో ఎండోమెంట్‌లో ఉన్న చెన్నకేశవస్వామి దేవాలయమును మధ్యలో కొందరు స్వార్థపూరిత రాజకీయాల వలన ఎండోమెంట్ నుండి తొలగించారు. తిరిగి మళ్లీ ఎండోమెంట్‌లో కలపడం శుభపరిమాణం అని వారన్నారు. వచ్చే ఎన్నికలలో నేను భారతీయ జనతా పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే చెన్నకేశవస్వామి గుడిలో ధ్వజస్థంభం ఏర్పాటు, దొంగలు దొంగలు ఇచ్చిన సిద్ధి వినాయకస్వామి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. నల్లమలలు దేవాలయాలపై ఉత్తనిధుల వేటగాళ్లు నల్లమలలు దేవాలయాలపై ఉత్తనిధుల వేటగాళ్లు చాలా దేవాలయాలను ధ్వంసం చేశారు. వీటిని రక్షణ లేకపోవడం ప్రభుత్వమే కారణమని వారన్నారు. హిందూ సంప్రదాయాలకు అవమానాలు జరిగితే బిజెపి పార్టీ చూస్తూ ఊరుకోదని వారు హెచ్చరించారు. త్వరలో పదర మండల కేంద్రంలో భారీ ఎత్తున భారతీయ జనతా పార్టీలోకి బిజెపి మండల అధ్యక్షులు కొయ్యల మల్లేష్ మాదిగ, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు నీలం రవి ముదిరాజ్, బిజెపి నాయకులు రాము, గోలి రవి, అనిల్, రాజు, సతీష్, అంజి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన గుండాల అంబరామలింగేశ్వరుడు..

- పెద్ద రథోత్సవానికి పోటెత్తిన భక్తులు
- హోరెత్తిన అంబరామలింగేశ్వరుడి నామస్మరణ
- కన్నుల పండువగా గుండాల జాతర

**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా వెలుగొందుతున్న గుండాల అంబరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శివరాత్రి నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున స్వామి వారి పెద్ద రథోత్సవాన్ని భక్తులు కన్నుల పండువగా ఆలయ అర్చకులు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలతో పాటు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో గుండాల అంబరామలింగేశ్వర దేవాలయం భక్తజన సంద్రంగా మారింది. నమో శివయా అంటూ భక్తుల నినాదాలు హోరెత్తాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అంబ పరమేశ్వరి దేవికి క్షీరాభిషేకం, విశేష మంగళ ద్రవ్యములచే అభిషేకం, విశేష అలంకరణ, భక్తులచే అమ్మవారికి లలిత సహస్ర నామంచే కుంకుమార్చన,వృషభ వాహనసేవతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్టించారు.

**వైభోవంగా రథోత్సవం..**

ప్రత్యేకంగా అలంకరించిన పెద్దతేరు రథంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారి రథోత్సవాన్ని లాగడానికి ఉత్సాహంగా ముందుకొచ్చారు. ఆలయం నుంచి ఎదురుగా ఉన్న గాలి గోపురం చుట్టు ప్రదిక్షణలు చేసిన అనంతరం స్వామి వారికి అర్చకులు హారతి ఇచ్చారు. స్వామి వారి రథం ఆలయం దగ్గరకు యదస్థానానికి భక్తులు చేర్చారు. కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జీ అసిస్టెంట్ సెషన్ జడ్జీ కుమారస్వామి దంపతులు, డీఎస్పీ గిరిబాబు, సీఐ రామకృష్ణ, వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ అర్చకులు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా వెల్దండ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుండాల సర్పంచ్ మైసయ్య,ఆలయ ఈఓ ప్రసాద్, గ్రామస్తులు కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, వీరేశం శర్మతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జడ్జీ, డీఎస్పీ



పెద్ద తేరును లాగుతున్న భక్తులు

## మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ.వెంకటేష్ వివాహ వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ నేతలు



టీజీ.వెంకటేష్ రాజ్యలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ నేతలు



టీజీ.వెంకటేష్‌తో జిల్లా ఆర్యవైశ్య మహాసభ నేతలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ రాజ్యలక్ష్మి దంపతుల 50వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ పట్టణంలోని వారి స్వగృహంలో శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ రాజ్యాలక్ష్మి దంపతులను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటోను బహుకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్య కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, బల్స శ్రీరాములు, జిల్లా మహాసభ ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, పీఆర్ఓ మిర్యాల రాజయ్య, మెడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, విసనకర్రల చంద్రకుమార్, ఉప్పల భారతయ్య, కొండూర్ శ్రీను, పోల విష్ణు, మిడిదొడ్డి శేఖర్, కూన రవి, సొమిశెట్టి సాయి కిశోర్, విజయ్ కుమార్, నరేష్, సాయిరాం, మురళి, శ్రీను, లక్ష్మినారాయణతో పాటు ఆర్యవైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు నట్టల మందులు తాగించుకోవాలి..

**-జిల్లా పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి**



నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్

**అచ్చంపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 28 వరకు నిర్వహించే ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని గొర్రెల మరియు మేకల పెంపకం దారులు ఉపయోగించుకొని వారి మందులకు నట్టల నివారణ చేయించుకోవాలని జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.వి.రమేష్ అన్నారు. శనివారం లింగాల మండలం సూరాపూర్, బల్మూర్ మండలం రామాజీపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నట్టల నివారణ శిబిరాలను జిల్లా పశువైద్యాధికారి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. నట్టల నివారణ మందులు తాగించడం వలన జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని, ఇతర త్ర వ్యాధులు ధరి చేరవని, ప్రతి గొర్రె కనీసం 2 కిలలో బరువు పెరుగుతుందని, ఆరోగ్యమైన పిల్లలకు జన్మనిస్తాయన్నారు. జీవాలలో ఈతల మధ్య కాలం తగ్గుతుందని, ఒకటి కంటె ఎక్కువ పిల్లలు పుట్టే అవకాశాలు ఉంటాయన్నారు.అనంతరం బల్మూర్ పశువైద్య శాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల పశువైద్య సిబ్బందితో సమీక్షా నిర్వహించి మండలంలో చేపడుతున్న నట్టల నివారణ శిబిరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు వెంకటేశ్వర్లు, మహేశ్వరి, పశువైద్య సిబ్బంది మాధ్య, శ్రీను, శ్రీమంజు, సమ్రీన్, వెంకటేష్, గోపాల మిత్రలు తదితరులు ఉన్నారు.

## హాత్ సే హాత్ జోడో కార్యక్రమం



హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో కాంగ్రెస్ నాయకులు

**మల్దకల్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రాహుల్‌గాంధి ఆదేశాల మేరకు హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ అభియాన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ దేశానికి రాష్ట్రానికి గాని ఈ జోగులాంబ గద్వాల జిల్లాకు గాని ఈ మల్దకల్ మండలానికి ఏదైనా చేసిందంటే కాంగ్రెస్ పార్టీ ఒకటేనన్నారు. ఎందుకంటే ఈ దేశంలో ప్రాజెక్టులన్ని కట్టింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టులు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్నారు. ప్రతి ఊరిలో స్కూలు, ఆసుపత్రిలో కట్టించామన్నారు. దేశంలో కులం మతాలకతీతంగా పరిపాలన అందించిన ఘనత పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీఅన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బల్గెర నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గట్టు గౌస్, సీనియర్ కౌన్సిలర్ గద్వాల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇసాక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ మరో జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్ జమాల్, గద్వాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్ర, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వెంకటేశ్, గద్వాల మండల అధ్యక్షుడు రఘునాయుడు, మల్దకల్ మండల అధ్యక్షులు వెంకటేష్, మాజీ సర్పంచ్ దాసన్న, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరి అలెగ్జాండర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు కిఫయత్, వినీద్, షబాఖత్, మోష, హాజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోపాలమిత్ర జిల్లా సంఘం అధ్యక్షుడిగా పి.వీరయ్య

**కోయిల్‌కొండ,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షులుగా పి. వీరయ్యను ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ జిల్లా గోపాలమిత్రలందరు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షులుగా దేవరకద్ర మండలానికి చెందిన పి. వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా హాజి అహ్మద్‌ను, కార్యదర్శిగా వెంకోజీ, ముఖ్య సలహాదారులుగా రాములు, గౌరవ అధ్యక్షులుగా బి. వెంకట్‌నారాయణ, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌లను ఎన్నుకోవడం జరిగింది. వీరితోపాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన పి. వీరయ్య మాట్లాడుతూ నన్ను జిల్లా సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్న గోపాల మిత్రులందరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గోపాలమిత్ర సంఘం సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోపాలమిత్ర సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, ఉదయ్, రమేష్, రాములు, రామకృష్ణ, సంగయ్య, కురుమయ్య, యాదిరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**రూ.7550 ధర పలికిన కింటాల్ కందులు**

**దేవరకద్ర,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం 3 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.అయితే కింటాల్ కందులకు అత్యధికంగా రూ.7550 ధర పలికింది.అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది. అలాగే 5 కింటాళ్ళ ఆముదాలనురైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.5425 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.6409 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థి అన్విక



**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన వెల్దండ రవీంద్రచారి మేఘన దంపతుల కుమార్తె అన్విక హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నది. ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 6వ తరగతిలో సీటు సంపాదించింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి సైనిక్ స్కూల్‌లో పాఠశాలలో సీటు సంపాదించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డితో పాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయ బృందం అన్వికను అభినందించారు.

## ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**జడ్చర్ల,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** జడ్చర్ల పురపాలిక పరిధిలోని 6వ వార్డు ఆలూర్ రోడ్ పాత బజార్‌లో వెంకటస్వామి భార్య సత్యమ్మ (59) అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవిందర్ మరణించిన వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే చర్లకొల్ల లక్ష్మారెడ్డి సహకారంతో వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుంకసారి రమేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు ట్రాక్టర్‌ను డీ కొట్టిన లారీ..



**కొత్తకోట,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** పట్టణ కేంద్రం సమీపంలోని చెక్కాలయ దర్గా వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం ఉదయం చెరుకు ట్రాక్టర్‌ను లారీ బలంగా ఢీ కొట్టింది. చెరుకు ట్రాక్టర్ టెక్కాలయ దర్గా నుండి బైపాస్ రోడ్డులో వచ్చి జాతీయ రహదారి పై కి ఎక్కగానే హైదరాబాద్ నుండి కర్నూల్‌వైపు వెళ్తున్న లారీ వెనక నుండి ట్రాక్టరన ఇంజన్ వద్ద ఢీ కొట్టింది. కొంతదూరం ఇడ్చుకుంటూ వెళ్లింది. డ్రైవర్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదని హైవే పోలీసులు తెలిపారు. సుమారు గంట పాటు ట్రాఫిక్ ను మళ్లించారు.

## సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి..



**అమరచింత,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో రూ.3కోట్ల 36లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మంగమ్మ నాగభూషణం గౌడ్, వైస్ చైర్మెన్ జీఎస్ గోపి, మున్సిపల్ కమీషనర్ మహ్మద్ ఖాజ అన్నారు. శనివారం 10వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు పనులు వారు పరిశీలించారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సహకారంతో అమరచింత మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పార్టీలకు అతీతంగా అబివృద్ధి చేసుకోవాలని ఆమె కోరారు.

## సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలి:మండల విద్యాధికారి చంద్రుడు నాయక్

**తెల్కపల్లి,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మన ఊరు మనబడి కింద కొనసాగుతున్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి ఎస్. చంద్రుడునాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని గట్టునెల్లికుదురు, గట్టురాయిపాకుల గ్రామాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరు మనబడి కార్యక్రమం కింద పాఠశాలలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయవలసిందిగా పాఠశాల యాజమాన్య కమిటి ఛైర్మన్‌లకు సూచించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. జనవరి నెల వరకు విద్యార్థుల ప్రగతిని ట్యాంగరింగ్ యాప్‌లో నమోదు చేయవలసిందిగా పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జహంగీర్ పాషా, ఉపాధ్యాయులు చంద్రకాంత్, సీఆర్పీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రుడునాయక్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రుడునాయక్

# పురుగుమందుల దుకాణదారులు అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

◆ వ్యవసాయశాఖ ఏడిఏ యశ్వంతరావు హెచ్చరిక

◆ దేవరకద్రలో ఎరువులు,పురుగుమందుల దుకాణాల తనఖీ

**దేవరకద్ర,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** పురుగుమందుల దుకాణదారులు అవకతవకలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడ వెనుకంజ వేసే ప్రసక్తేలేదని వ్యవసాయశాఖ ఏడిఏ యశ్వంతరావు హెచ్చరించారు. దేవరకద్రలో శనివారం వివిధ పురుగుమందులు,ఎరువుల దుకాణాలను మండల వ్యవసాధికారి రాజేందర్‌అగర్వాల్‌తో కలసి అకస్మిక తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణదారులతో ఏడిఏ యశ్వంతరావు మాట్లాడి పలు సూచనలు,సలహాలతో పాటు పలు హెచ్చరికలు చేశారు. పురుగుమందుల, ఎరువుల దుకాణదారులు ఎట్టిపరిస్థితులతో అవకతవకలు పాల్పడరాదన్నారు.పురుగుమందుల,ఎరువుల కొనుగోలు విషయంలో దుకాణదారులు రైతులకు సహకరించలే తప్ప వారికి నష్టం కలిగే,ఇబ్బందులకు గురిచేసి పనులు చేయరాదన్నారు. ఒకవేళ ఆ విదంగా ప్రవిర్తించినట్లైతే వారిపై ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 యాక్ట్ ప్రకారం వారి లైసున్సులను రద్దు చేయడంతో పాటు చట్టపరంగా తగు చర్యలు తీసుకొంటామన్నారు. ఈ విషయంలో వ్యవసాయాశాఖ నిఖ్ఖంచిగా వ్యవహరిస్తుదన్నారు. యూరియా మరియు ఇతర కాంప్లెక్స్ ఎరువులను అధిక ధరలకు విక్రయించరాదన్నారు.



దేవరకద్రలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడిఏ



దేవరకద్రలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడిఏ, వ్యవసాయాధికారి

ఎరువులతో పాటు గుంటటులికలుగాని, కీటకనాశిని గుళికలుగాని లింకు పెట్టినచో వారిపై ఖచ్చితంగా తగు చర్యలు తీసుకొంటామని వ్యవసాయశాఖ ఏడిఏ హెచ్చరించారు. ఇక మీదట తరచూ దుకాణాలను అకస్మికతనఖీలు చేస్తామన్నారు.ఈ సందర్భంగా ఆయాదుకాణాలలో స్టాక్ వివరాలు స్వయంగా పరిశీలించారు. ఎరువులు,ఫర్టిలైజర్ మందులను పరిశీలించి అన్ని వివరాలు అడిగితెలుసుకొన్నారు. ఈ సందర్భంగా దుకాణాల వద్దకు వచ్చిన రైతులకు కూడ ఏడిఏ,వ్యవసాయాధికారి పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: దయ్యపు రాధాకృష్ణ



**వీపనగండ్ల,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ఈనెల 27,28 తేదీలలో కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం రాష్ట్రస్థాయి సమావేశాలు జనగామ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ఈ సందర్భంగా మనువాదమ్, రాజ్యాంగం అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యపు రాధాకృష్ణ తెలిపారు.ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా ప్రొ.కాశీమ్ హాజరవుతారని అన్నారు. భారతరాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనిషినీ మనిషిగా చూడని ఫాసిస్ట్ వాద మనుస్మృతిని ప్రవేశపెట్టాలని చూస్తున్నారు మనువాద బావజాలాన్ని వ్యతిరేఖంగా రాబోయే కాలంలో అంబేద్కర్ స్ఫూర్తితో చైతన్య యత్రలు, జాతరలు, మేదావుల చర్చగోష్టులు అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ సమావేశాలలో పోరాట కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మృతురాలి కుటుంబాలకు ఆర్థిక సాయం



**వెల్దండ, ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన రౌతు ముత్యాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తన ఫౌండేషన్ సభ్యుల ద్వారా రూ.5వేలను తక్షణ సహాయం క్రింద అందించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.3వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్టు సభ్యులు అందించారు.కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధం



**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని భైరాపూర్ గ్రామానికి చెందిన రైతు కల్వ శ్రీరాములు, కల్వ పరంధాములకు చెందిన గడ్డి వాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. పశువుల కోసం రూ.20వేలు వెచ్చించి గడ్డిని కొనుగోలు చేయడమైందని, ప్రమాదవశాత్తు పూర్తిగా గడ్డివాము దగ్ధం కావడంతో పశువులకు పశు గ్రాసం లేకుండా పోయిందని రైతులు బోరున విలపించారు.

## ఆలయ ప్రకార మండప నిర్మాణానికి రూ.50 లక్షల మంజూరు

**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** గుండాల అంబరామలింగేశ్వర ప్రకార మండప నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు ఆలయ ఈఓ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ ప్రసాద్ మాట్లాడుతూ దేవాదాయ, ధర్మదాయ శాఖ నుంచి రూ.50లక్షల ప్రకార మండప నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు, దేవాలయం తరువు నుంచి దాతల సహకారంతో రూ.10 లక్షలు డిపాజిట్ చేస్తే రూ.50లక్షలు మంజూరవుతాయన్నారు.దేవాలయాభివృద్ధికి దాతలుముందుకొచ్చి విరాళాలు అందించాలన్నారు.



ఆలయ ఈఓ ప్రసాద్

## పురాతన ఆలయ ఆవరణలో ముళ్ల చెట్ల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న యువకులు

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** మండల కేంద్రం శివారు ప్రాంతంలో అల్లిపేట గుట్టపై గల పురాతన ఆలయం ఆవరణలో పురావస్తుశాఖ అనుమతులతో శనివారం గ్రామ యువకులు ముళ్లపొదలను తొలగించారు. పురాతన హిందూ దేవాలయ పునరుద్దరణ కమిటీ ఆధ్వర్యంలో మహ్మదుస్సేన్‌పల్లి గ్రామ సమీపంలోని అల్లాపేట గుట్టలో ఉన్న పురాతన పద్మనాభ స్వామి దేవాలయంలో ఉన్న కంప చెట్లను పురావస్తు శాఖ అనుమతితో తొలగించి శుభ్రం చేశారు. ఆలయాన్ని పట్టించుకోకపోవడంతో ఆలయం శిథిలావస్థలో ఉంది. ఆలయానికి వెళ్లే దారిని బాగు చేయడానికి యువకులు శ్రమించారు. రాబోయే రోజుల్లో ఆలయంలో పూజలు చేయాలని యువకులు కోరారు.ఆహ్లాదకరమైన వాతావరణంలో శిల్ప సంపద భక్తులను ఆకర్షించే విధంగా ఉందని గ్రామ యువకులు తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని వినియోగంలోకి తేవాలని పలువురు ఆకాంక్షించారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన జడ్పీటీసీ

**శ్రీరంగాపురం,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఆటో భగవంతు శుక్రవారం మరణించడం జరిగింది. శనివారం భగవంతు మృతదేహానికి జడ్పీటీసీ, డీసీసీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్,నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి వారికి అండగా ఉంటామని అన్నారు. వారి వెంట సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



# మన్యంకొండకు పోటెత్తిన భక్తజనసందోహం

◆ కొనసాగుతున్న భక్తుల దర్శనాలు

◆ స్వామివారికి దాసంగాలు సమర్పించిన భక్తులు

**దేవరకద్ర,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుండి భక్తులు స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మన్యంకొండలో ఎక్కడ చూసిన భక్తులే కనిపించారు. దేవస్థానం భక్తజనసందోహంతో పులకించిపోయింది.వివిద ప్రాంతాల నుండి వచ్చే భక్తులు 3కిలోమీటర్ల మేర ఉన్న ఘాటురోడ్డు గూండా నడచుకొంటూ,వివిద వాహనాలలో కొండ పైకి చేరుకొన్నారు. దీంతో ఎప్పుడూ నిర్మానుష్యంగా కనిపించే ఘాటు రోడ్డు భక్తులతో కళకళలాడింది. దేవస్థానం పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి. దీంతో దేవస్థానం ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. దేవస్థానం దిగువకొండ, తేరుమైదానం,కోనేరు ప్రాంతాలలో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. దీంతో మన్యంకొండలు భక్తులతో పులకరించిపోయాయి.ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్ కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సేవలు ముగిసినప్పటికి విశేషదినాల సందర్భంగా మన్యంకొండకు భక్తులు పోటెత్తుతున్నారు.



మన్యంకొండలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

**స్వామివారికి దాసంగాలు:** కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలను సమర్పించి స్వామివారిని దర్శించుకొన్నారు. మరికొంతమంది తలనీలాలు సమర్పించారు. మన్యంకొండ స్వామివారి బ్రహ్మోత్సవాలు గతనెల 31న అంగరంగా వైభవంగా ప్రారంభమైన విషయ విధితమే. ఈ నెల రోజులు శని,సోమవారాలలో భక్తులు మన్యంకొండ అధికసంఖ్యలో తరలివస్తూనే ఉన్నారు.

# కౌకుంట్లలో కొనసాగుతున్న సైన్స్ సంబరాలు

**దేవరకద్ర,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్ల గుడ్‌షెఫర్డు ప్రవేటు పాఠశాలలో ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ సంబరాలను నిర్వహించారు. ఈ నెల 22 నుండి ఈ సంబరాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ రాజు అధ్వర్యంలో విధ్యార్థులకు క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. అలాగే శాస్త్రవేత్తలు మరియు వారి యొక్క ఆవిష్కరణలు,విధ్యార్థులు,సమాజం పైన వారి యొక్క ఆవిష్కరణల ప్రభావం అనే విషయాలమీద విధ్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.అలాగే వివిద రంగాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలను పొంది సమాజంలో నేడు ఆయా రంగాలలో ఆదర్శవంతంగా ఉన్నటువంటి స్థానికంగా చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను కూడ విధ్యార్థులకు వివరించారు. 3రోజుల పాటు జరిగిన వివిధ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమాలలో విధ్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీలలో ప్రతిభ కనబరచిన విధ్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ రాజుతో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు కురుమూర్తి, ఉపాధ్యాయులు,ఆయా తరగతుల విధ్యార్థులు పాల్గొన్నారు.



కౌకుంట్లలో విద్యార్థులకు అవగాహనకల్పిస్తున్న ఉపాధ్యాయుడు

# బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల ప్రగతి

**గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తా : గ్రామ సర్పంచ్ బోయ లక్ష్మమ్మ అంజయ్య**

**ఊర్కొండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు ప్రగతి వైపు ప్రయాణిస్తున్నాయని గ్రామ సర్పంచ్ బోయ లక్ష్మమ్మ అంజయ్య అన్నారు. శనివారం ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం క్రింద మంజూరైన రూ.10లక్షల నిధులతో గ్రామ సర్పంచ్ బోయ లక్ష్మమ్మ అంజయ్య ఉప సర్పంచ్ పావని జగదీశ్వర్‌రెడ్డితో కలిసి సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలని, గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే దేశ పురోగాభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలను డ్రైనేజీ వ్యవస్థ, నీటి సమస్య, విద్యుత్ దీపాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్, తిరుపతిరెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోవింద్ విజయ్‌యాదవ్, బోయ తిరుపతి తదితరులు ఉన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్

# గిరిజన విద్యార్థులపై దాడి చేయడం హేయమైన చర్య

**వెల్దండ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గిరిజన విద్యార్థులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు శంకర్‌నాయక్ అన్నారు. చారకొండ మండలం వంకరాయి తాండకు చెందిన నేనావత్ నవీన్ నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో చదువుకుంటున్నాడు. హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితుడు హరిహర కృష్ణ క్రూరంగా హత్యచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి చోటు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులపై ఏదో ఒక చోట దాడులు చోటు చేసుకుంటున్నాయని, దాడులపై ప్రభుత్వం స్పందించకపోవడం వల్లనే దాడులు పెరిగిపోతున్నాయని, దాడుల చేసిన నిందుతులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుడు నవీన్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని పేర్కొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

# అంబురాన్నంటిన స్వపరిపాలన దినోత్సవం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల లింగసానిపల్లిలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చంద్రశేఖర్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థుల్లో ప్రతిమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో కల్వకుర్తి జూనియర్ కళాశాల అధ్యాపకులు సదానందంగౌడ్, గ్రామ సర్పంచ్ జంగయ్య, ఎస్ఎమ్‌సీ చైర్మన్ బాల నాగయ్య, మాజీ చైర్మన్ పరుశరాములు, వార్డు సభ్యులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మహేశ్వరి, వెంకటేష్, మహేశ్వరం, నెహ్రుప్రసాద్, నయీమొద్దిన్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.




విద్యార్థులైన ఉపాధ్యాయులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

## కామ్రేడ్ లక్ష్మీ ఆశయాలను కొనసాగిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్

**వీపనగండ్ల,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో కామ్రేడ్ లక్ష్మీ 2వ వర్ధంతి సభను సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ హాజరైకామ్రేడ్ లక్ష్మీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామ కార్యదర్శి బాలగౌడ్ అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి ఎండి జబ్బార్ మాట్లాడుతూ కామ్రేడ్ లక్ష్మీ సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో 20ఏళ్లు పేదల పక్షాన పోరాడుతున్న జాతీయ రాష్ట్ర నాయకులకు తన సేవలు అందించి ఉద్యమానికి ఊపిరి పోసిందని, నేడు కామ్రేడ్ లక్ష్మీ మన ముందు లేకపోవడం చాలా బాధకరమని ఆమె మన ముందు భౌతికంగా లేకపోయిన ఆమె నడిచిన మార్గంలో మనమంతా నడుస్తూ కామ్రేడ్ లక్ష్మీ ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. పేద ప్రజల సమస్యలపై నిరంతరం సీపీఎం పార్టీ రాజీ లేని పోరాటం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామని అన్నారు. దేశంలోని బూర్జువ పార్టీలు ఎన్ని అడ్డంకులు తల పెట్టిన అంతిమ విజయం సీపీఎం పార్టీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి. జిల్లా నాయకులు మండ్ల కృష్ణయ్య, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, మండల నాయకులు మురళి, నాగరాజు, ఈశ్వర్, సీఐటీయు నాయకులు రంజాన్,అలీ, ఐద్వా జిల్లా నాయకురాలు సాయిలీల, పీఎన్ఎం నాయకులు శివ, గ్రామ సీపీఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సూగూరు పీఠాధిపతి మక్బుల్ సాహెబ్‌ని సన్మానించిన వనపర్తి జిల్లా మైనార్టీ నాయకులు



మక్బుల్ సాహెబ్‌ని సన్మానిస్తున్న జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** హజ్ యాత్రకు వెళ్తున్న సూగూరు పీఠాధిపతి మక్బుల్ సాహెబ్ ను వనపర్తి జిల్లా మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరు సంస్థానాదీషులు మక్బుల్ సాహెబ్ పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా వారిని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్తున్న మక్బుల్ సాహెబ్ హజ్ యాత్ర ముగించుకొని క్షేమంగా తిరిగి రావాలని అలాగే జిల్లా ప్రజలు, రాష్ట్ర ప్రజలు క్షేమంగా ఉండాలని అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించాలని అదే విధంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ జోహెబ్ హుస్సేన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గులాం ఖాదర్‌ఖాన్,నాయకులు స్టార్ రహీం,ఏకె పాషా,ఎండి మజీద్ ఉన్నారు.

## ఉపాధిహామీ కూలీ రూ.600 ఇవ్వాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు




**అమరచింత, ఫిబ్రవరి25ప్రభాతవార్త:** ఉపాధిహామీ కూలీ రోజుకు రూ.600 ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు డిమాండ్ చేశారు. శనివారం అమరచింత మండల కేంద్రం గౌతమ్ స్కూల్ లో ఎ.రవీందర్ అధ్యక్షతన మండల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం రోజుకు 257రూ.కూలీగా నిర్ణయించిన 120 నుండి రావడం లేదని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని కూలీ మాత్రం ఆ స్థాయిలో పెంచడం లేదని అన్నారు. వారానికో సారి ఇవ్వాల్సి ఉండగా నెలలు పడుతోందని ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జాబ్ కార్డులు, బ్యాంకు అకౌంట్ నెంబర్లు, ఆధార్ కార్డుతో అనుసంధానం జాప్యంతో కూలీల సంఖ్య తగ్గుతుందని అన్నారు. వ్యవసాయ పనులు తగ్గాయని వేసవికాలంలో ఉపాధిహామీ కూలే ఆధారంఅని అన్నారు. ప్రతి గ్రామంలో కూలీల సంఖ్యకు అనుగుణంగా పనులను గుర్తించి అడిగిన వారందరికి పని కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకానికి గత ఏడాది రూ.90వేలకోట్లు కేటాయింపులు ఉండగా ఈబడ్జెట్‌లో రూ.60 వేలకు తగ్గించి రూ.30వేల కోట్లు కోత పెట్టిందని అన్నారు. రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి కూలీ కి పని రూ.600 కూలీ ఇవ్వకుంటే కూలీలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అబ్రహం కూలీలు, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనార్ధన్‌రెడ్డిని గెలిపించాలి

**పెబ్బేరు,ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** రంగారెడ్డి–హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కాటేపల్లి జనార్ధన్ రెడ్డి ని గెలిపించాలని పీఆర్టీయు తెలంగాణ నాయకులు కోరారు. శనివారం పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు తలకంటి మహిపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన పెబ్బేరు ఆదర్శ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్య ప్రాతినిత్యం వహిస్తూ సమస్యలు పరిష్కరించిన జనార్ధన్ రెడ్డి గెలిపించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ తగిన పీఆర్సీ, నూతన జిల్లా వారీగా ఉపాధ్యాయుల విభజనలో కూడా ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూశారని గుర్తు చేశారు.ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాలు జరిపేటట్లు కృషి చేస్తమని అన్నారు. గతంలో సకల జనుల సమ్మెకాలానికి 42రోజులవేతనాలు ఇప్పించారని, మాయలో ఉపాధ్యాయులను 90రోజుల చైల్డ్ పేరు సులువు మంజూరు చేయించడం జరిగిందని అలాగే పీఆర్సీ బకాయిలు ఇప్పించిన ఘనత కాటేపల్లి జనార్ధన్‌రెడ్డిదే అని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పెబ్బేరు మండలంలోని జిల్లా పరిషత్ బాలుర బాలికల జూనియర్ కాలేజీ డిగ్రీ కళాశాల ఆదర్శ పాఠశాల కస్తూర్బా గాంధీ షాగాపూర్ పాఠశాల సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న పీఆర్టీయు జిల్లా నాయకులు

## సకాలంలో వాహనాల ట్యాక్స్‌లు చెల్లించాలి



ట్రాక్టర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ సతీష్

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ప్రైవేటు వాహనాలను ట్యాక్సీ వాహనాలను శనివారం ఆర్‌టీఓ సతీష్ తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ట్యాక్సీలు చెల్లించని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వాహనాల ట్యాక్సీలు ఇన్సూరెన్స్‌లో చెల్లించాలని ట్యాక్సీ డ్రైవర్లకు తెలిపారు. వాహనాల డ్రైవర్లు ఫిట్నెస్ లు సకాలంలో చేసుకోని ఇబ్బందులు లేకుండా వాహనాలు నడుపుకోవాలని అన్నారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్సీలను చెల్లించాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే జరిమానా విధించక తప్పదని హెచ్చరించారు.

## కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: దయ్యపు రాధాకృష్ణ

**వీపనగండ్ల,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ఈనెల 27,28 తేదీలలో కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం రాష్ట్రస్థాయి సమావేశాలు జనగామ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ఈ సందర్భంగా మనువాదమ్, రాజ్యాంగం అనే అంశంపై సెమి నార్ నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యపు రాధాకృష్ణ తెలిపారు.ఈ సెమి నార్‌కు ముఖ్య అతిథిగా ప్రొ.కాశీమ్ హాజరవు తారని అన్నారు. భారతరాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనిషినీ మనిషిగా చూడనిఫాసిస్ట్ వాదమనుస్మృతిని ప్రవేశపెట్టాలని చూస్తున్నారు మనువాద బావజాలాన్ని వ్యతిరేఖంగా రాబోయే కాలంలో అంబేద్కర్ స్పూర్తితో చైతన్య యతలు, జాతరలు, మేదావుల చర్చగోష్టులు అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ సమావేశాలలో పోరాట కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యారంగం బాగుకై దేవన్న గారి మల్లారెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించండి



దేవన్న గారి మల్లారెడ్డి

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో టీయుటిఎఫ్ కీలకపాత్ర పోషించిందని మహబూబ్‌నగర్ రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవ స్థాపక అధ్యక్షులు దేవన్న గారి మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోట లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాఠ శాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ గురుకుల,బాలికల, బాలుర ఉన్నత పాఠశాలో, జిల్లాపరిషత్ ఉర్దూ, జిల్లా పరిషత్ పాలెం, జిల్లా పరిషత్ అమడబాకుల, మోడల్ స్కూల్,అమడబాకుల కేజీబీవీ, మదనాపురం మండల పరిధి లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య వాద సంఘమైన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నుండి విడిపోయి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెరేషన్ స్థాపించి స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా శక్తి వంచనా లేకుండా కృషి చేసిందని అన్నారు. ఆనాటి పాలకులు ఎన్ని కుతంత్రాలు, నిర్బంధాలకు పాల్పడిన లొంగకుండా తెలంగాణ ఉద్యమం చేసామని అన్నారు. టీయు టీఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమ సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులను, ప్రజలను ఉద్యమం వైపు తిప్పేందుకు అవగాహన కల్పించామని అన్నారు. ఒకవైపు తెలంగాణ ఉద్యమం చేస్తూనే పాఠశాలల అభివృద్ధికి చేశామని అన్నారు. తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్ కు శ్వాత పరిష్కారం, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, మోడల్ స్కూల్ కు కూడా బదిలీలు, పదో న్నతులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు బదిలీలకు షెడ్యూల్ రిలీజ్ చేయించే విధంగా తదితర సమస్యల పరిష్కరింపచేసి ఉపాధ్యాయులందరి హృదయాలలో సంతోషాన్ని నింపే బాద్యత వహిస్తామనని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట వనపర్తి జిల్లా అధ్యక్షులు పి.బాలచెన్నయ్య, ప్రధాన కార్యదర్శి గంధం దాస్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మర్రికుంట చెరువులో ప్లాట్లు అమ్మిన ప్రజా ప్రతినిధులు కోటీశ్వరులు అయ్యారు

● అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్



మర్రికుంట చెరువులోని ప్లాట్లను పరిశీలిస్తున్న అఖిల పక్ష నాయకులు

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** వనపర్తిలోని మర్రికుంట బాదితుల పిలుపు మేరకు అచలపక్ష ఐక్యవేదిక మర్రికుంట చెరువులో ప్లాట్లు అమ్మిన ప్రజా ప్రతినిధులు కోటీశ్వరులు అయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ మాట్లాడుతూ కొందరు ప్రజా ప్రతినిధులు కాంట్రాక్టర్లు కలిసి వేసిన వెంచర్లలో అమాయక ప్రజలు ప్లాట్లు కొని నష్టపోతున్నారని అన్నారు. వారిని శిక్షించాలని కోరారు. ఒక చెరువులో కానీ, కుంటలో కానీ, ఎఫ్‌టీటీఎల్ బఫర్ జోన్ ఉంటుందని దాని పరిధిలో ప్రభుత్వ భూమి ఉంటే అది ప్రభుత్వానికి చెందిందని పట్టా భూమి ఉంటే దాని పరిధిలో మాత్రం పంటలు వేసుకోవడానికి మాత్రమే అవకాశం ఉంటుందని అమ్మడానికి కానీ ఇల్లు కట్టుకోవడానికి పర్మిషన్లు ఉండవని తెలిసిన ప్రజా ప్రతినిధులు భూమి ఎలా కొంటారని, ప్లాట్లు ఎలా వేస్తారని, ఎలా ప్రజలకు అమ్ముతారని ఆయన ప్రశ్నించారు. అలాగే ఈ ప్లాట్లు అమ్మిన తరువాత అధికారులు వాటికి ఎలా పర్మిషన్లు ఇచ్చారని వారిని కూడా శిక్షించాలని ఆయన కోరారు. బాదితులకు ఇప్పుడున్న భూమి రేటు ప్రకారం ఇవ్వాలని వారికి పూర్తిగా న్యాయం చేసే వరకు ముందుండి పోరాడుతామని అన్నారు. అన్ని తెలిసిన ప్రజాప్రతినిధులు మంత్రిని తప్పుద్రోవ పట్టించే చేష్టలు మానాలని కోరారు. దీనిపై మంత్రి కలెక్టర్ విచారణ చేసి వెంటనే బాదితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచలపక్ష ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జానంపేటరాములు,సుధాకర్ యాదవ్,రమేష్, గంధం సుమన్, ఆది, చంద్రయ్య,సుధాకర్‌యాదవ్,లక్ష్మణ్‌యాదవ్,భాస్కర్,శేఖర్‌రావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

**మహ్మదాబాద్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మహ్మదాబాద్ మండల పరిధిలోని దేశాయిపల్లి గ్రామంలో శనివారం మహ్మదాబాద్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కెఎం నారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా మల్లేష్ ప్రధాన కార్యదర్శిగా పి. వెంకట్‌రెడ్డి ఉపాధ్యక్షులు జి.చెన్నయ్య, కార్యదర్శులుగా కె.రాజు, కె.బీరయ్య, ఎ.కృష్ణయ్య, డి.ఆంజనేయ, భగవంతు, నారాయణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కెఎం నారాయణ, మండల సంయుక్త కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శారీరక దృఢత్వం ఎంతో అవసరం: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** శనివారం సాయంత్రం బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ కో శ్రీహర్ష ఎప్పుడు ప్రజాక్షేత్రంలో బిజీగా ఉండడమే కాకుండా తమ శారీరక ధృడత్వాన్ని కూడా అంతే దృఢంగా ఉంచుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. జిల్లా కేంద్రంలో క్రీడా మైదానంలో జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగులు 24,25 తేదీల్లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నారాయణపేట టౌన్‌లో గల మిని స్టేడియంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కల్టెకర్ విచ్చేసి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. గెలుపొందిన టీంలకు, సభ్యులందరికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో నారాయణపేట,మక్తల్, కోస్గి, డివిజన్ ఉద్యోగస్తులు టీమ్‌లుగా విడిపోయి తలపడడం జరిగింది. ఇందులో విన్నరగా కోస్గి టీం కప్పును గెలుచుకోవడం జరిగంది. రన్నరప్‌గా మక్తల్ డివిజన్ నిలిచారు. 400ల మీటర్ల పరుగు పందెంలో నారాయణపేట డివిజన్ వారు మొదట స్థానంలో బహుమతిని గెలుచుకోవడం జరిగింది. వాలీబాల్ క్రీడల్లో మక్తల్ డివజన్ వారు మొదటి బహుమతిని గెలుచుకున్నారు. వివిధ క్రీడల్లో మాగనూరు ఏఓ హరిత, వ్యవసాయ విస్తరణ అధికారులు కల్పన, మునీరాబేగం, రాధిక వెంకటమ్మ, సభ్యులు విజేతలుగా నిలబడి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. రెండు రోజుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా, ఘనంగా కలెక్టర్ అనుమతితో నిర్వహించడం పట్ల వ్యవసాయ శాఖ ఉద్యోగులు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, మక్తల్ వ్యవసాయ సహాయ సంచాలకులు పీతటీలు, సాయినాథ్, రాధిక, బసంతరెడ్డి, అక్షర, వెంకటప్పలు వెన్నుదన్నుగా నిలిచి ఉద్యోగస్తులచే క్రీడలు నిర్వహించారు. వారికి కూడా వ్యవసాయ శాఖ ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

# తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

● వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ● ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, వితౌట్ లైసెన్స్‌లో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్

**వనపర్తి క్రైమ్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని బస్టాండ్, మహిళా డిగ్రీ కాలేజ్, గ్రీన్ పార్క్ ఏరియాలో గత నెల రోజుల నుండి షీటీమ్, వనపర్తి వారు ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వితౌట్ లైసెన్స్ పై ద్విచక్ర వాహనాలు నడిపే ఆకతాయిలను పట్టుకోవడం జరిగింది. అందులో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పట్టుపడ్డ 14మంది ఆకతాయిలు, వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లా పోలీసు శాఖ స్త్రీల సంరక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటోందని అందుకు అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. వనపర్తి జిల్లా పరిధిలో ఆడపిల్లల భద్రత కోసం పోలీసులు షీ టీమ్ ల ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆకతాయిలకు కౌన్సిలింగ్ ద్వారా వారి చెడు ప్రవర్తనను మార్చుకోవడానికి తిరిగి బాధ్యత గల పౌరులుగా మారే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ఆడవారికి ఎదురయ్యే భౌతిక పరమైన దాడులు, లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు వనపర్తి జిల్లా పోలీసులు ఇరువై నాలుగు గంటలు అందుబాటులో ఉంటున్నామని పేర్కొన్నారు. ఆడవారిని ఇబ్బంది పెట్టేవారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మైనర్లు బైకె నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రుల పై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని, లైసెన్స్‌లు సీజ్ చేయడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.



ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి

# మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి

● వీక్లీ పరేడ్‌లో మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కవాతు మైదానంలో సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌కు ఎస్పీ ఎ.నరసింహ హాజరయ్యారు. కవాతు అనంతరం ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పోలీస్ డిపార్టుమెంట్ అనేది ప్రజల రక్షణ, సమాజ భద్రత శ్రేయస్సు కోసం కాబట్టి మనం మానసికంగా,శారీరకంగా క్రమశిక్షణతో ధృఢంగాఉంటే ప్రజల సమస్యలను సమయానుకూలంగా, సమర్థవంతంగా చేయడానికి వీలవుతుంది. అందు కోసం మనం ప్రతినిత్యం శరీర ధృఢత్వం కోసంశారీరక, మానసిక ప్రవర్తన కోసం యోగా లాంటి వ్యాయామాలు చేయవలెను. పోలీస్ డిపార్టుమెంట్ అనేది క్రమ శిక్షణతో కూడిన సిబ్బంది సమూహ ప్రయాణం కావున ఈ వీక్లీ పరేడ్ అవసరం. సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణ డిపార్టుమెంట్‌లో ముఖ్యపాత్ర పోషిస్తుంది. సిబ్బంది యొక్క సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కారం చేయమని ఆదేశాలు ఇచ్చారు. సిబ్బందికి సంబంధించిన అన్ని రకాల పెండింగ్ అలవెన్స్ సత్వరమే వచ్చేటట్లు చూస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు,డీఎస్పీలు వెంకటరమణారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాసులు రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పరేడ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది





గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

# నేటి బాలలే రేపటి పౌరులు

● మీ హక్కులను కాపాడటమే పోలీస్ శాఖ లక్ష్యం: మల్దకల్ ఎస్సై ఆర్.శేఖర్

**మల్దకల్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండలంలోని కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బిజ్వారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి, విద్యార్థినులతో మల్దకల్ ఎస్సై ఆర్. శేఖర్ సమావేశమయ్యారు. ఈ సందర్భగా ఎస్సై మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, ఎదిగి ఎదగని వయసులో పెళ్లిళ్ల చేసుకుంటే పురిటి నొప్పుల సమయంలో పడే బాధలు వివరించారు.చిన్న వయసులో మత్తుకు బానిసలు కాకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పెళ్లిళ్ల చేసుకున్న సమయంలో అత్తారింటి వాళ్లు కోడళ్లను వరకట్నం పేరిట వేధించినట్లయితే ఎలాంటి శిక్షణ ఉంటాయో వివరించారు. ముఖ్యంగా చిన్నారులు లైసెన్స్ లేకుండా బైక్‌లు నడపడం సరికాదన్నారు. గ్రామాలలో యూత్ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ కనిపెంచిన తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చవద్దన్నారు. సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ ఎందరికో ఆదర్శం కావాలని అన్నారు. ఈ సమాజంలో చదువుకున్న ఉన్న విలువ దేనికిలేదన్నారు. చదువును నమ్ముకుంటే ఎంతటి శిఖరాల వరకైనా తీసుకెళ్తుందని అన్నారు. ప్రస్తుతం నిరక్షరాస్యులైన మన తల్లిదండ్రుల బాటలో భవిష్యత్తులో మన పిల్లలు బాధలు పడకూడదనుకుంటే ముందు మనం కష్టపడి చదివి ఉన్నత స్థానంలోకి వెళ్లిన తర్వాత మన పిల్లలకు బంగారు భవిష్యత్తును ఇచ్చిన వాళ్లమవుతామని ఆయన సూచించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం న్యూస్ పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలని అన్నారు. న్యూస్ పేపర్ చదవడం వల్ల సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కల్పించుకున్న వాళ్లమవుతామని అన్నారు. గ్రామంలో కులమతాలకతీతంగా ఉంటూ అందరు కలిసి మెలిసి ఎందరికో ఆదర్శంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో 100ను 108ను ఏ విధంగా వినియోగించుకోవాలి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మల్దకల్ పోలీస్ సిబ్బంది నిరంజన్, రఘునాథ్‌రెడ్డి, హోమ్ గార్డు హుస్సేన్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# పప్పు శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఇటిక్యాల,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రైతులు రబిలో సాగు చేసిన పప్పు శనగ పంటను పుటాన్‌దొడ్డి సహకార సంఘంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలలో రైతులు క్వింటాలుకు రూ. 5335 మద్దతు ధరకు అమ్ముకోవాలని మార్క్‌ఫెడ్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో గల గోదాంలో మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ రంగారెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిడ్డారెడ్డి ఆధ్వర్యంలో పప్పుశనగల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో ఛైర్మన్ రంగారెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పప్పుశనగ ధాన్యాన్ని 14 శాతం తేమ మించకుండా మట్టి పెల్లలు లేకుండా తీసుకువచ్చి క్వింటాలుకు రూ. 5335 మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు పండించిన పప్పుశనగ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలలో తీసుకుంటుందని ఒక ఎకరాకు 6 క్వింటాళ్ల ప్రకారం కొనుగోలు చేస్తుందని ప్రతిఒక్క రైతు టోకెన్ తీసుకుని కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. గ్రామాల వ్యవసాయ అధికారుల ధృవీకరణ పత్రం, పొలం, పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు, జిరాక్స్ పత్రాలను రైతులు వెంట తెచ్చుకోవాలని ఛైర్మన్ రంగారెడ్డి రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, చిన్న నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, మధుసూదన్‌రెడ్డి, బొజ్జెస్, సుజాతమ్మ, ఏఈఓ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గోపాలమిత్ర సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

◆ మహబూబ్‌నగర్ జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షులు పి.వీరయ్య

**కోయిల్‌కొండ,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షులుగా పి. వీరయ్యను ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ జిల్లా గోపాల మిత్రలందరు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షులుగా దేవరకద్ర మండలానికి చెందిన పి. వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా హాజి అహ్మద్‌ను, కార్యదర్శిగా వెంకోజీ, ముఖ్య సలహాదారులుగా రాములు, గౌరవ అధ్యక్షులుగా బి. వెంకట్‌నారాయణ, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌లను ఎన్నుకోవడం జరిగింది. వీరితోపాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా గోపాలమిత్ర సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన పి. వీరయ్య మాట్లాడుతూ నన్ను జిల్లా సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్న గోపాల మిత్రులందరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గోపాలమిత్ర సంఘం సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోపాలమిత్ర సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, ఉదయ్, రమేష్, రాములు, రామకృష్ణ, సంగయ్య, కురుమయ్య, యాదిరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షునితో గోపాలమిత్రలు